


శ్రీరస్తు

శుభమస్తు

శ్రీమద్భాగవతే
చతుశ్శ్లోకి భాగవతం
- భావార్థముతో -

అవిఘ్నమస్తు



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/



శ్రీమద్భాగవతే చతుశ్లోకి భాగవతం - భావార్థముతో.

- - -

భాగవతము భగవంతునిమహిమలను, ఆయన లీలా వైభవములను, భక్తులయొక్క పవిత్ర గాథలను, మోక్షప్రాప్తికి వారొనర్చిన కృషిని, తత్ఫలములను మనోహరముగా తెలుపును భాగవతము యొక్క పూర్తి సారమే "చతుశ్లోకి భాగవతం" భగవంతుడైన శ్రీమన్నారాయణుడు దీనిని మొదట బ్రహ్మకు ఉపదేశించెను.

తరువాత బ్రహ్మ నారద మహర్షికి, నారదమహర్షి వ్యాస మహర్షికి, వ్యాస మహర్షి తనకుమారుడైన శుకమహర్షికి ఉపదేశించెను.

చతుశ్లోకి భాగవతం " ఓం " కారతత్వంతో నిండివున్నది. 1వ శ్లోకం " బ్రహ్మతత్వము " ను - 2వ శ్లోకం " జగత్ తత్వము " ను - 3వ శ్లోకం " మాయా తత్వము " ను - చివరిదైన 4వ శ్లోకం " ఆత్మ తత్వము " ను తెలియబరుచును. ఈ నాలుగు తత్వములు కూడా ప్రణవ మంత్రము " ఓం " లోని భాగములే.

- - -

(శ్రీమన్నారాయనుడు బ్రహ్మ దేవునికి చెప్పిను)

శ్రీ భగవానువాచ:

01.జ్ఞానం పరమగుహ్యం మే యద్విజ్ఞాన సమన్వితమ్।
సరహస్యం తదంగం చ గృహా(హే)ణ గదితం మయా॥

అతి రహస్యమైన వేదాంతమును, విజ్ఞానముతో కూడిన జ్ఞానమును, కలిగి ఎవడు నిరంతరము ఉన్నాడో వాడు తప్ప అన్యము లేదనే స్పృహను సాధనగా స్వీకరించు.

02. యావానహం యథా భావో యద్రూపగుణకర్మకః।
తథైవ తత్త్వ విజ్ఞానమస్తు తే మదనుగ్రహాత్॥

నేను ఎవరిని? నా అసలు స్వరూపం ఏమిటి? నేను చేసేది ఏమిటి? అను విషయములు నా అనుగ్రహం వల్ల నీకు తెలుస్తాయి.

\- - - - - -

03. అహమేవాసమేవాగ్రే నాన్యద్యత్సదసత్పరం।
పశ్చాదహం యదేతచ్చయోఽ వశిష్యేత సోఽస్మ్యహం।

సృష్టికి ముందు నేనే ఉన్నాను. తరువాత కార్య కారణాత్మకమైన సృష్టి ఏర్పడగానపుడు నేనే ఉన్నాను. సృష్టి లయించాక ఏది మిగిలిందో అది నేనే.

04. ఋత్తేఽర్థం యత్ప్రతీయేత న ప్రతీయేత చాత్మని।
తద్విద్యా దాత్మనో మాయాం
యథాఽఽభాసో యథా తమః॥

రెండు రకాలుగా అసత్యం ఉంటుంది. అసలు సత్యం తెలియక పోవడం ఒకటి, ఒకదానికి ఒకటి తెలియడం మరొకటి. ఈ రెండు దోషాల వల్ల నీవు అసలు సత్యం తెలుసుకోలేక పోతున్నావు.

- - - - - -

05. యధా మహాంతి భూతాని భూతేషూ(షు)చ్చావచేష్వను।
ప్రవిష్టాన్యప్రవిష్టాని తథా తేషు న తేష్వహమ్॥

నేను అన్నిటి యందు ప్రవేశించి ఉన్నప్పటికి కూడా వాటి యందు నేను ఉన్నాను కాని, నా యందు అవి లేవు.

06. ఏతావదేవ జిజ్ఞాస్యం తత్త్వజిజ్ఞాసునాఽఽత్మనః।
అన్వయవ్యతిరేకాభ్యాం యత్స్యాత్సర్వత్ర సర్వదా॥

స్వస్వరూపం తెలుసుకోవాలని ఎవడు మధన పడుతున్నాడో, వాడు ఉన్నదంతా ఆయనే, ఆయన తప్ప ఇంకేమి లేదు అనే సత్యాన్ని తెలుసుకుంటే చాలు.

- - - - - -

07. ఏతన్మతం సమాతిష్ఠ పరమేణ సమాధినా।
భవాన్ కల్పవికల్పేషు న విముహ్యతి కర్హిచిత్॥

ఈ జ్ఞానము నందు చెక్కు చెదరకుండా బుద్ధిని ఎవడు నిలుపుతాడో వాడు ఇక ప్రపంచము నందు మోహములో పడడు.

- - -

ఇతి చతుశ్శ్లోకి భాగవతం సంపూర్ణమ్.

సంస్కృత చతుశ్లోకి భాగవతమునకు బమ్మెర పోతన గారు ఆంధ్రీకరించిన 6 భాగం మీ సౌలభ్యం కోసం యిచ్చుట పొందు పర్చుడ మైనది. చూడండి.

\- - - - - - - × × × - - - - - -

బ్రహ్మదేవుడు గావించిన విన్నపం విని భగవంతుడైన పద్మాక్షుడు ఈ విధంగా పలికాడు.

ఓయీ! సరోజసంభవా! శాస్త్రాల అర్థాన్ని పరిశీలించినందువల్ల కలిగే జ్ఞానమూ - నా మీద భక్తి - ఉత్తమమైన సాక్షాత్కారమూ - అనే ఈ మూడూ నీ మనస్సులో గట్టిగా నిల్పుకో!

జలగర్భా! నీ స్వరూపమూ – స్వభావమూ – ప్రభావమూ – అవతారాలూ – అందు నేను చేసే కర్మలూ – వీటి నన్నింటినీ గ్రహించే తత్వజ్ఞానం నా అనుగ్రహం వల్లనే నీకు కలుగుతుంది. సృష్టికి ముందు నేను ఒక్కణ్ణే ఉండేవాణ్ణి. అప్పుడు నాకు ఎలాంటి కర్మ సంబంధమూ ఉండేది కాదు. స్థూలరూపమూ, సూక్ష్మరూపమూ, వాటికి కారణమైన ప్రకృతీ, నా అంశంలోనే అప్పుడు లీనమై ఉంటాయి. అందువల్ల నే నొక్కడనే తప్ప నాకంటే వేరైన మరొక పదార్థమంటూ ఉండదు. కుమారా! సృష్టికాలంలో జనించిన జగత్తంతా నా స్వరూపమే అని గ్రహించుకో. కమలసంభవా! కల్పానికీ, ప్రళయానికీ మధ్యకాలంలో తుది మొదలు లేనివాడనై, నిండైన నిత్యమహిమతో గూడి నేను పరమాత్ముడనై ఉంటాను. అంతేకాదు. నీ విందాక నన్ను జగత్తును నిర్మించడానికి హేతువైన మాయావిధానాన్ని గురించి అడిగావు. ఆ విషయం తెలియపరుస్తాను.

ముత్తెపుచిప్పను చూచినపుడు దానిలో వెండిలేకున్నా ఉన్నట్లు తోస్తుంది. అదే మాదిరి లేని వస్తువు ఉన్నట్లు తోచి విచారించి చూస్తే లేదని స్పష్టమవుతుంది. ఇది దేని మహిమవల్ల జరుగుతున్నదో, అదే నా మాయా

విశేషమని గ్రహించుకో. అంతేకాక మాయప్రభావం వల్ల లేని వస్తువు కనిపించడం, ఉన్న వస్తువు కనిపించకపోవడం జరుగుతూ ఉంటుంది. చంద్రుడొక్కడే ఐనా ఇద్దరు చంద్రులున్నట్లు కనిపిస్తుంది కదా! ఇది లేని వస్తువు కనిపించటానికి దృష్టాంతం. రాహుగ్రహం ఉన్న వస్తువు కనిపించకపోవడానికి దృష్టాంతం. గ్రహమండలంలో రాహుగ్రహమనే గ్రహం ఉన్నా అది మనకు కనిపించదుగదా! పృథివ్యాదులైన మహాభూతాలు భౌతిక పదార్థాలైనా ఘటం, పటం మొదలగు వస్తువులలో ప్రవేశించి ఉంటాయి. అలాగే నేను భూతాలలోనూ, భూతనిర్మితాలైన సమస్త భౌతిక పదార్థాలలోనూ సత్త్వాది రూపాలలో ప్రవేశించి ఉంటాను.

పృథివి మొదలైన భూతాలలో ఘటపటాదులైన భౌతిక పదార్థాలు కారణావస్థను పొందుతాయి. అదేరీతిగా భూతాలూ, భౌతికాలూ – ఇవన్నీ నాలో కారణావస్థను పొంది ఉంటాయి. అంతేకాని అభివ్యక్తాలై ఉండవు. ఇంతవరకూ నిరూపితమైన ఈ పరబ్రహ్మస్వరూపం అన్ని దేశాలలోనూ, అన్ని కాలాలలోనూ ఇలాగే ఉంటుంది. కాని మార్పు చెందదు. తత్వం తెలుసుకోగోరే మీబోటి వాళ్ళకు నేనిప్పుడు చెప్పినదే తత్వ స్వరూపమైన అర్థమని గ్రహించు. ఈ అర్థమే అన్నిటికంటే శ్రేష్ఠ మయినది. దీన్ని ఏకాగ్రమైన మనస్సుతో విని హృదయంలో నిలుపుకో. అలా చేస్తే జగన్నిర్మాణాది కార్యాలు చేసేటప్పుడు మోహం నిన్నంటదు.

ఈ విధంగా భగవంతుడైన పరమేశ్వరుడు బ్రహ్మకు ఆనతిచ్చాడు. అనంతరం తన వైకుంఠలోకంతో కూడా అంతర్థానం చెందాడు.

॥ శుభం ॥

– – – = – – –

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్





(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి. –944 044 9650, 994 994 1430)

Kiron Type Institute